
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | ఆదివారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 25 | డిసెంబర్ 28, 2025 | వెల : రూ.3-00


దినపత్రిక



**పహల్గామ్‌లో పర్యాటకుల సందడి**

4లో..

- □ స్థానిక ఎన్నికలతో పెరిగిన రాజకీయ వేడి
- □ సర్పంచ్ ఫలితాలతో బీఆర్ఎస్ దూకుడు
- □ కేసీఆర్ మాటలకు రేవంత్ కౌంటర్
- □ సీఎం వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
- □ కేటీఆర్ రంగంలోకి దిగడంతో మరింత వేడి
- □ 29 నుంచి అసెంబ్లీ వేదికగా ఎదురెదురు పోరు
- □ రాష్ట్ర రాజకీయాల్లో పెరిగిన ఉత్కంఠ




# మాటల యుద్ధం!

## కాంగ్రెస్, బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ

3లో..

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు మరోసారి మాటల తూటాలతో వేడెక్కాయి. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల అనంతరం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు తీవ్రస్థాయికి చేరింది. సర్పంచ్ ఎన్నికల్లో సుమారు 40 శాతం స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందడంతో పార్టీ అధినేత కేసీఆర్ స్వరం ఒక్కసారిగా మారి, 'ఇప్పటిదాకా ఒక లెక్క..ఇప్పటి నుంచి ఇంకో లెక్క. ఇక ఊరుకోం.. తోలు తీస్తాం.. ఇక ప్రజల్లోనే ఉంటామని, ప్రజాక్షేత్రంలోనే పోరాటం చేస్తాం..' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త మంట రాజేసింది. దీనికి ప్రతిగా కొడంగల్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ, కేసీఆర్, కేటీఆర్ ను ఉద్దేశించి అత్యంత తీవ్ర వ్యాఖ్యలు చేశారు.. వాటికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎగవేతల సీఎం.. ఒక్కోసారి ఎడమ కాలి చెప్పుతో కొట్టాలని ఉంది..' అంటూ కౌంటర్ ఇవ్వడం రాజకీయ వేడిని మరింత పెంచింది. ఇరు పార్టీల నేతలు పరస్పరం మాటల దాడులతో ముందుకెళ్లడంతో, విధానాలు-పాలన వైఫల్యాలపై జరగాల్సిన చర్చ క్రమంగా వ్యక్తిగత విమర్శల దిశగా మళ్లుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## ఉపాధి హామీ బచావో

- పేదల ఉపాధిపై దాడిని సహించబోం
- గాంధీ పేరుతో వచ్చిన పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది
- సీఎం రేవంత్ రెడ్డి
- జనవరి 5 నుంచి ఉద్యమం ప్రారంభించాలని కాంగ్రెస్ నిర్ణయం
- దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలకు పిలుపు

4లో..



## సీఎంది దిగజారిన భాష

- ప్రజాస్వామ్య సంస్కారాల ఉల్లంఘన
- సర్పంచులకు బూతు భాషా రాజకీయాల పాఠమా?
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే దాడులు
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రావణ్
- సీఎం రేవంత్ రెడ్డి భాషా వైఖరిపై తీవ్ర విమర్శలతో బహిరంగ లేఖ

4లో..

## గోదావరిలో వైభవంగా నదీ హారతులు


- జై శ్రీరామ్ అంటూ మార్మోగిన గోదారి తీరం
- తిలకించి పులకించిన భక్త జనం

4లో..

## ఢిల్లీలో గాలి నాణ్యత వెరీ పూర్!

- మళ్లీ ఉగ్రరూపం దాల్చిన వాయు కాలుష్యం
- ఓవరాల్ ఏక్యూఐ 355.. పలు ప్రాంతాల్లో 400కు పైగా..
- దీర్ఘకాలిక పరిష్కారమే మార్గం: సీజేఐ ఆందోళన

**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి :**




దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. శనివారం ఉదయం కూడా నగరమంతా ప్రమాదకరమైన పొగమంచు కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజా గణాంకాల ప్రకారం నగరంలో ఓవరాల్ గాలి నాణ్యత సూచిక (ఏక్యూఐ) 355గా నమోదై, 'వెరీ పూర్' కేటగిరీలో కొనసాగుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 9 గంటల సమయానికి ఢిల్లీలో కాలుష్య స్థాయిలు మరింత పెరిగాయి. ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 410గా, జహన్‌గిరిపురిలో 414గా నమోదైంది. నరేలా, రోహిణి ప్రాంతాల్లో 406గా, షాదిపూర్‌లో 408గా నమోదవడంతో పరిస్థితి

మిగతా 3వ పేజీలో..

## వెండి పరుగులు!

- ఒక్కరోజే రూ.20వేలు హైక్
- కిలో ధర రూ.2,74,000
- బంగారం కూడా అదే బాటలో
- 24 క్యారెట్ల గోల్డ్ తులం రూ.1,41,220



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

దేశంలో గత కొన్ని నెలలుగా బంగారం, వెండి ధరలు శరవేగంగా పెరుగుతున్నాయి. తాజాగా బులియన్ మార్కెట్‌లో వెండి ధర ఒక్కరోజులోనే ఊహించని రీతిలో భారీగా పెరిగి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. శుక్రవారం కిలో వెండి ధర రూ.2,54,000గా ఉండగా, శనివారం ఏకంగా రూ.20,000 పెరిగి రూ.2,74,000కు చేరుకుంది. అంతకుముందు రోజు కూడా వెండి ధర భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. గురువారం రూ.2,45,000గా ఉన్న ధర శుక్రవారం రూ.9,000 పెరిగి రూ. 2,54,000కు చేరింది. ఇక బంగారం ధరలు కూడా పెరుగుదల బాటలోనే కొనసాగుతున్నాయి.

మిగతా 3వ పేజీలో..

## జర్నలిస్టుల అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి

- జీవో రద్దు చేసి అక్రిడిటేషన్లు పునరుద్ధరించాలి
- ప్రశ్నించే స్వరాలను అణచివేసే కుట్ర
- ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కే ప్రయత్నమే ఈ అరెస్టుల వెనుక ఉందని విమర్శించారు. శాంతియుతంగా

మిగతా 3వ పేజీలో..

వేద న్యూస్

ఆదివారం డిసెంబర్ 28, 2025

# మంథని రాజశేఖర్‌కు నివాళి



**వేద న్యూస్, కాసిపేట:**

చాలా కాలంగా కాసిపేట మండల ప్రజాపరిషత్‌లో అటెండర్‌గా విధులు నిర్వర్తించిన మంథని రాజశేఖర్ 25న మృతి చెందాడు. రాజశేఖర్ మృతి పట్ల సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అలాగే మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజశేఖర్ అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకొని, ఆయనతో గల అనుభవాలను సిబ్బంది స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, శ్రీదేవి, మేఘన, ఏపీఓ నవీన్ కుమార్, రాజేశ్వరి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బందికి క్రమశిక్షణ తప్పనిసరి

- సర్వీస్ రికార్డులను నవీకరించాలి
- అసాంఘిక శక్తులపై ఎప్పటికప్పుడు ఫోకస్ పెట్టాలి
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు
- రామాయంపేట్ పోలీస్ స్టేషన్ తనిఖీ

**వేద న్యూస్, రామాయంపేట్:**



వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం రామాయంపేట్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు పరిశీలించారు. ఈ సంద ర్భంగా పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం డీఎస్పీ, సీఐ, ఎస్సైలు పూలమొక్కను అంద జేసి ఆయనకు ఆత్మీయంగా స్వాగతం పలి కారు. పోలీస్ స్టేషన్ ఆవరణ లో ఉన్న వాహ నాల స్థితిగతులు, వాటి నిర్వహణ తీరును, వాటికి సంబంధించిన కేసుల వివరాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అలాగే సిబ్బందికి కేటాయించిన పరికరాలు, సర్వీస్ రికార్డులు, స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, పెండింగ్ కేసుల వివరాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలకు సైబర్ క్రైమ్ మోసాలపై జాగ్రత్తలు, రోడ్ సేఫ్టీ నియమాలు, మహిళల భద్రత, షీ టీం సేవలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ ద్వారా పూర్తి స్థాయిలో సమాచార సేకరణ చేస్తూ ప్రజలతో మరింత మమేకం కావాలని సూచించారు.కేసుల దర్యాప్తులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వేగంగా, నాణ్యతతో విచారణలు నిర్వహించాలని, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎసై బాలరాజు, సిబ్బంది ఉన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- నూతన సంవత్సర వేడుకలు సురక్షితంగా జరుపుకోవాలి
- జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు..
- సీసీ కెమెరాలతో చట్ట వ్యతిరేక చర్యలపై ప్రత్యేక నిఘా
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

**వేద న్యూస్, మెదక్:**

నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని, పిల్లలు, పెద్దలు అందరూ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇండ్లలోనే వేడుకలు జరుపుకోవాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. పోలీసుశాఖ సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తుందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని ఎస్పీ తెలిపారు. ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసామని, ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి సంబంధితులపై నాన్ - బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. డిసెంబర్ 31 రాత్రి ఆర్గనైజ్డ్‌గా వేడుకలు నిర్వహించేందుకు పోలీసు అనుమతి లేదని, టపాసులు, డీజేలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరమని, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని తెలిపారు. మైనర్ల కు వాహనాలు ఇవ్వకూడదని, మైనర్లకు మద్యం విక్రయించడం నేరమని హెచ్చరించారు. రహదారులు బ్లాక్ చేయడం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, ఇతరులకు ఇబ్బందులు కలిగించడం, ఇళ్లు, ప్రైవేట్ ఆస్తులు, వీధి దీపాలపై రాళ్లు వేయడం, అద్దాలు పగల గొట్టడం, నిషేధిత డ్రగ్స్, గంజా వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయాల్లోనే మూసివేయాలని, బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏ కార్యక్రమం నిర్వహించినా ముందస్తుగా పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు.న్యూ ఇయర్ ఆఫర్ల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, ఆన్లైన్‌లో అపరిచితులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్ నంబర్లు ఇవ్వవద్దని ప్రజలను కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీసు అధికారులను లేదా డయల్ 100కు ఫోన్ చేసి పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు.




# ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలి




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

- జర్నలిస్టులకు నష్టం చేకూర్చే జీవో 252ను వెంటనే సవరించాలి
- టీయూడబ్ల్యూజే హెచ్ 143 జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా
- రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులతో భారీ నిరసన

ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 252 జర్నలిస్టుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉందని టీయూడబ్ల్యూజే హెచ్ 143 జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా అన్నారు. జీవోను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ వద్ద చలో కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడుతూ.. ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనల వల్ల క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మెజారిటీ జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులు పొందే అవకాశాన్ని కోల్పోతారన్నారు. జీవోను రూపొందించిన విధానం జర్నలిస్టుల హక్కులను, సంక్షేమాన్ని కాలరాయడమేనని లాయక్ పాషా మండిపడ్డారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో జర్నలిస్టులు తమ ప్రాణాలను, ఉద్యోగాలను పణంగా పెట్టి పోరాడారని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్య భూమికను పోషించిన జర్నలిస్టు సమాజంపై నేడు ప్రభుత్వం కక్ష గట్టడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. ప్రజా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి జర్నలిస్టుల సంక్షేమం దృష్ట్యా ఈ జీవోను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినప్పటికీ జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వ కాలయాపన విధానం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే హెచ్ 143 ప్రధాన కార్యదర్శి సామల గట్టు, ఎలక్ట్రానిక్ మీడియా టెమ్జు అధ్యక్షుడు ఇరుకుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ లతోపాటు వివిధ మండలాల ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గం, యూనియన్ నాయకులు, సుమారు 100కు పైగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐలను అవమానించేలా మాట్లాడడాన్ని ఖండిస్తున్నాం

- సీఎం భాష ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ
- బీఆర్ఎస్ నాయకుడు మేడిపల్లి వివేక్ రెడ్డి


**వేద న్యూస్, వేములవాడ:**

తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు అత్యంత దురదృష్టకరంగా మారాయని బీఆర్ఎస్ నేత మేడిపల్లి వివేక్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇటీవల కొత్తగా గెలిచిన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగించిన భాష ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చగా మారిందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి దిగజారిన స్థాయిలో మాట్లాడటం అత్యంత బాధాకరమని, రాజకీయ హుందాతనానికి పూర్తిగా విరుద్ధమని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీని లేకుండా చేస్తా అంటూ బెదిరింపులకు దిగడం రాజకీయ అహంకారానికి పరాకాష్టగా అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణకు గౌరవాన్ని తీసుకొచ్చే విధంగా కష్టపడి జీవిస్తున్న ఎన్ఆర్ఐలను అవమానించేలా మాట్లాడటం తీవ్రంగా ఖండనీయమని వివేక్ పేర్కొన్నారు. ఉపాధి కోసం స్వదేశాన్ని వదిలి విదేశాల్లో కష్టపడి పనిచేస్తున్న లక్షలాది మంది తెలంగాణ బిడ్డల శ్రమను చిన్నచూపు చూడటం సమాజానికి తగదని అన్నారు. శ్రమకు గౌరవం ఇవ్వడమే నిజమైన సంస్కృతి అని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ గౌరవాన్ని, స్వాభిమానాన్ని కాపాడేందుకు ఎప్పటికీ ముందుంటుందని, ప్రజలే తగిన సమయంలో తగిన సమాధానం ఇస్తారని మేడిపల్లి వివేక్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పొంచిన ప్రమాదం

- ట్రాన్స్‌ఫార్మర్లు అసలు కనిపిస్తలే
- చుట్టూ విపరీతంగా పెరిగిన గడ్డి



**వేద న్యూస్, జమ్మికుంట:**

మండల పరిధిలోని పాపక్కపల్లి గ్రామం నుంచి రాచపల్లి వెళ్లే మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ విపరీతమైన గడ్డి పెరగడంతో ముప్పు పొంచి ఉందని రైతులు కొందరు చెబుతున్నారు. అసలు ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించనంతగా గడ్డి పెరిగే అవకాశం ఉందని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ గడ్డి తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గడ్డి మొత్తం కప్పి వేసి ఉండటంతో ఏవైనా ఓల్టేజీ సమస్యలు వచ్చే అవకాశాలుంటాయని, అక్కడ చెట్లు పొదల వల్ల మరుగు ఏర్పడి సర్పాలు రావచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న గడ్డిని తొలగించాలని కోరుతున్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన వినిల్ రాజ్

**వేద న్యూస్, కాజీపేట:**




కాజీపేట ఫాతిమా నగర్లోని మాన్ ఫోర్ట్ సీబీఎస్సీ పాఠశాలకు చెందిన ఆరవ తరగతి విద్యార్థి ఎడ్ల వినీల్ రాజ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ గోపు విన్సెంట్ రెడ్డి రాష్ట్రస్థాయికి ఎంపికైన వినీల్ రాజ్ ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఎంపిక ప్రక్రియలో పాల్గొని వినిల్ రాజ్ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని కొనియాడారు. జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. విద్యార్థిని అభినందించిన వారిలో ఆ పాఠశాల పీఈటీలు ఆంటోనీ, ప్రశాంత్, సునీల, ఇతర ఉపాధ్యాయులు, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి ఉన్నారు.

# నీటి తొట్టెలు శుభ్రం చేయించిన సర్పంచ్



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో పశువులు తాగే నీటి తొట్టెలు అపరిశుభ్రంగా మారడంతో గ్రామ సర్పంచ్ మచ్కూరి రమేష్ నీటి తొట్టేలను శుభ్రం చేయించారు. ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో పనులు చేయిస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పిట్ల కళ్యాణ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.


# గ్రామ సమస్యలపై సర్పంచ్ సమీక్ష

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామానికి సంబంధించిన పలు అంశాల మీద అన్నిశాఖల అధికారులతో సర్పంచ్ పట్నం అశ్విని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామానికి సంబంధించిన పంచరాయికి చెందిన పట్టాలు, పెండింగ్లో ఉన్న భూ సమస్యలు, పేద రైతులకు ఇనాములో పట్టాలు, పాత సాదబైనమాలు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొందరగా పూర్తి చేయాలన్నారు. గ్రామంలో యువతకి కౌన్సిలింగ్ ఇచ్చి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూడాలని, సీసీ కెమెరాల మానిటరింగ్ తప్పనిసరి అని సంబంధిత అధికారిని కోరారు. రైతులకు ఎప్పటికీ అందుబాటులో ఉండి, యూరియా, నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలని వ్యవసాయాధికారులను కోరారు. వృద్ధులకు, గర్భిణులకు ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు చూస్తూ ఎప్పటికీ ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి మందులు ఇంటికి వెళ్లి ఇవ్వాలి.ప్రతి ఇంటి ఆవరణంలో శుభ్రంగా మరియు దోమలు లేకుండా వారికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటింటికి తిరిగి చెప్పాలి అని సంబంధిత అధికారిని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడటం, అందుకు తగట్టు మౌలిక సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంకా గ్రామానికి చెందిన పలు సమస్యలపై చర్చించే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండారి నరేష్ గౌడ్, అన్ని శాఖల అధికారులు, వార్డు సభ్యులు మల్లేశ్, మౌనిక మల్లేశం, సతీష్, వెంకటరెడ్డి, రాములు, అనిల్ కుమార్, పావని చంద్రమౌళి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక ఎన్నికలతో పెరిగిన రాజకీయ వేడి
- సర్పంచ్ ఫలితాలతో బీఆర్ఎస్ దూకుడు
- కేసీఆర్ మాటలకు రేవంత్ కౌంటర్
- సీఎం వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
- కేటీఆర్ రంగంలోకి దిగడంతో మరింత వేడి
- 29 నుంచి అసెంబ్లీ వేదికగా ఎదురెదురు పోరు
- రాష్ట్ర రాజకీయాల్లో పెరిగిన ఉత్కంఠ




# మాటల యుద్ధం!

## కాంగ్రెస్, బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు మరోసారి మాటల తూటాలతో వేడెక్కాయి. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల అనంతరం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు తీవ్రస్థాయికి చేరింది. సర్పంచ్ ఎన్నికల్లో సుమారు 40 శాతం స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందడంతో పార్టీ అధినేత కేసీఆర్ స్వరం ఒక్కసారిగా మారి, 'ఇప్పటిదాకా ఒక లెక్క..ఇప్పటి నుంచి ఇంకో లెక్క. ఇక ఊరుకోం.. తోలు తీస్తాం.. ఇక ప్రజల్లోనే ఉంటామని, ప్రజాక్షేత్రంలోనే పోరాటం చేస్తాం..' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త మంట రాజేసింది. దీనికి ప్రతిగా కొడంగల్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ, కేసీఆర్, కేటీఆర్ ను ఉద్దేశించి అత్యంత తీవ్ర వ్యాఖ్యలు చేశారు.. వాటికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎగవేతల సీఎం.. ఒక్కోసారి ఎడమ కాలి చెప్పుతో కొట్టాలని ఉంది..' అంటూ కౌంటర్ ఇవ్వడం రాజకీయ వేడిని మరింత పెంచింది. ఇరు పార్టీల నేతలు పరస్పరం మాటల దాడులతో ముందుకెళ్లడంతో, విధానాలు–పాలన వైఫల్యాలపై జరగాల్సిన చర్చ క్రమంగా వ్యక్తిగత విమర్శల దిశగా మళ్లుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ వేదికపై ఈ మాటల యుద్ధం మరింత ఉధృతం కానుందన్న అంచనాలతో, రాష్ట్ర రాజకీయ వాతావరణం పూర్తిగా వేడెక్కిపోయింది.

**– సీఎం తీవ్ర పదజాలం వాడడంతో..**

కేసీఆర్ వ్యాఖ్యలకు ప్రతిగా సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ వేదికగా తీవ్ర స్థాయిలో స్పందించారు. సర్పంచులకు సన్మానం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కేసీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల తర్వాత బయటకు వచ్చారని, అనుభవంతో మంచి మాట చెబుతారని అనుకున్నామని, కానీ మళ్లీ ఊకదంపుడు ఉపన్యాసాలే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. అంతేకాదు కేటీఆర్ ను ఉద్దేశించి...'నీ అవ్వ ఏనాడైనా నీ మొఖం అద్దంలో చూసుకున్నవా. పెరమూతి బోడలింగం. నువ్వు కూడా నా గురించి మాట్లాడతావా.. నువ్వెంత? నీ సాయి ఎంత.? అయ్య పేరు చెప్పుకొని బతికేవాడివి నువ్వు.. ఆంధ్రాలో చదువుకున్న నువ్వు, నీకేం తెలుసు తెలంగాణ గురించి. మా పౌరుషం గురించి, నువ్వు కాదు.. మొత్తం నీ జాతినంత తెచ్చుకో.. ఎక్కడికి రమ్మంటావో చెప్పు.. లాగుల తొండలు ఇడిసి కొడతం..' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనపై 180 కేసులు పెట్టి, చంచల్‌గూడ జైలుకు పంపించి, కుటుంబాన్ని కూడా వేధించారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీకార రాజకీయాలకు దిగలేదని, పగసాధింపు మొదలుపెడితే రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని భావించి ఆపుకున్నామని చెప్పారు. 'వాడు చేసిన పాపాలకు వాడే పోతాడు.. దేవుడు ఉన్నాడు కాబట్టి ప్రమాణ స్వీకారం రోజే శిక్ష మొదలైంది' అంటూ వ్యాఖ్యానించడం రాజకీయంగా సంచలనంగా మారింది.

**– జైలులో వేసినా ప్రయోజనం లేదంటూ..**

కేసీఆర్‌ను జైలులో పెట్టినా ప్రయోజనం లేదని, ఆయనే ఫామ్ హౌజ్‌ను బందీఖానాగా మార్చుకున్నారని సీఎం వ్యాఖ్యానించారు. చుట్టూ తన పోలీసులే ఉన్నారని, చర్లపల్లి అయినా చంచల్‌గూడ అయినా తేడా లేదని అన్నారు. ఆయన తినే తిండి నుంచి అన్నింటికీ ప్రభుత్వ ఖర్చే అవుతుందని వ్యాఖ్యానిస్తూ ఘాటు విమర్శలు చేశారు. తాము ఎవరిపైనా కక్షపూరితంగా ఒక్క కేసు కూడా పెట్టలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన తప్పులపై కూడా ప్రతీకారం తీర్చుకోలేదని అన్నారు..

**– నన్ను గెలకొద్దంటూ హెచ్చరికలు**

రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో కేసీఆర్ రాజకీయ అనుభవాన్ని ప్రస్తావిస్తూ, మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తాను రైతు బిడ్డనని, భూమి విలువ తెలిసిన వాడినని, బ్రోకర్ రాజకీయాలు చేయలేదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించామని, ఇంకా సిగ్గు లేకుండా బయటకు వచ్చి ఉపన్యాసాలు ఇస్తున్నారని మండిపడ్డారు. 2029లో తేల్చుకుందామని సవాల్ విసిరారు. తనను అనవసరంగా గెలకొద్దని మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఈనెల 29 నుంచి శాసనసభ సమావేశాలు ఉంటాయని సీఎం ప్రకటించారు. కేసీఆర్ ఎన్ని రోజులు అడిగితే అన్ని రోజులు సభ నడిపిస్తామని, నియామకాలు, నిధులు, అభివృద్ధి.. ఏ అంశంపైనైనా బహిరంగ చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఫామ్ హౌజ్‌లో కూర్చొని మాట్లాడడం కాదు, అసెంబ్లీ వేదికపై ఎదురెళ్లాలని హితవు పలికారు.

**– 'ఎగవేతల సీఎం' అంటూ కేటీఆర్ కౌంటర్**

సీఎం వ్యాఖ్యలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డిని 'ఎగవేతల సీఎం'గా అభివర్ణిస్తూ, పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రోజూ కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. 'నా తండ్రిని తిడితే ఒక కొడుకుగా నాకు ఆవేశం రాదా?' అంటూ తీవ్ర భావోద్వేగంతో స్పందించారు. రేవంత్ రెడ్డి వాడే భాషను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ఒక్కోసారి ఎడమ కాలి చెప్పుతో కొట్టాలనిపిస్తుందని...' తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కానీ తాను ఆ స్థాయికి దిగజారబోనని చెప్పారు. ఢిల్లీకి గులాంలా సంచులు మోసుకోమని, తెలంగాణ పౌరుషంతోనే బతుకుతామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో గెలవకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని కేటీఆర్ ప్రకటించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**– హనీమూన్ పీరియడ్ ముగిసిందన్న కేసీఆర్**

ఇదిలా ఉండగా, ఎర్రవెల్లి ఫామ్ హౌజ్‌లో జరిగిన సమావేశంలో కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇచ్చిన హనీమూన్ పీరియడ్ ముగిసిందని ప్రకటించారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టం చేశారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, సంక్రాంతి తర్వాత వరుస బహిరంగ సభలతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు తెలిపడంతో తెలంగాణ రాజకీయాలు తీవ్రంగా వేడెక్కాయి.. రెండు ప్రధాన పార్టీల ముఖ్యులు ఇలా మాటల తూటాలు పేల్చడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**– వ్యక్తిగత విమర్శల దిశగా..**

స్థానిక ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాలను పూర్తిగా వేడెక్కించాయి. కాంగ్రెస్ అధికార ధీమా, బీఆర్ఎస్ ప్రతిఘటన.. ఈ రెండింటి మధ్య మాటల యుద్ధం రాష్ట్ర రాజకీయాల్ని ఉలిక్కిపడేలా చేస్తోంది. ఇది కేవలం మాటలతో దాడులకే పరిమితమవుతుందా? లేక రానున్న రోజుల్లో రాజకీయ ఉద్యమాలుగా మారుతుందా? అన్నది వేచి చూడాల్సిందే. కాగా, ఈ మొత్తం పరిణామాల్లో విధానాలు, పాలన వైఫల్యాలపై చర్చించాల్సిన రాజకీయాలు క్రమంగా వ్యక్తిగత విమర్శల వైపు మళ్లుతున్నాయి. నేతల మాటల యుద్ధం ప్రజా సమస్యలకన్నా వ్యక్తిగత ఆరోపణలకే పరిమితమవుతుండటం రాజకీయ సంస్కృతిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**– అసెంబ్లీ వేదికగా ఫైట్**

ఈ నెల 29 నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. ఇప్పటికే బహిరంగ సభలు, ప్రెస్‌మీట్లు, ప్రకటనలతో పరస్పరం ఘాటు వ్యాఖ్యలు చేసుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు అసెంబ్లీ వేదికపై ఎదురెదురుగా తలపడేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. హామీల అమలు, పాలన వైఫల్యాలు, నిధుల కేటాయింపు, సాగునీటి ప్రాజెక్టులు వంటి అంశాలను ఆయుధాలుగా చేసుకుని ఇరు పార్టీలూ వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శాసనసభ సమావేశాలు మాటల యుద్ధానికి వేదికగా మారనున్నాయా? రాజకీయ ఘర్షణలు మరింత ఉధృతం కానున్నాయా? అన్నది రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# జర్నలిస్టుల అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి

వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళ్లిన జర్నలిస్టు సంఘాల నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించారు. ఇది కేవలం వ్యక్తుల అరెస్టు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే స్వరాలను అణిచివేసే కుట్రగా ఆయన పేర్కొన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఇచ్చిన హామీలకు ఇవేనా అర్థమని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఇచ్చిన ఆరు హామీలతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ చెప్పిన ఏడవ హామీ అంటే జర్నలిస్టులను అరెస్టు చేయడమేనా అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జర్నలిస్టులను భయపెట్టి, మౌనంగా మార్చే ప్రయత్నాలు నిరంకుశ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. కొత్త జీవోను సాకుగా చూపుతూ జర్నలిస్టుల అక్రిడిటేషన్లలో కోత విధించడం ద్వారా వారి ప్రాథమిక హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అహర్నిశలూ ప్రజల కోసం శ్రమించే జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వాల్సింది పోయి, ఉన్న వాటిని తొలగించడం ద్వారా వారి ఉపాధిని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. జర్నలిస్టుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్న మారుతి సాగర్, రమేశ్ హజారి, యోగానంద్, విష్ణువర్ధన్ రెడ్డి, రమణ కుమార్, కడకంచి వెంకట్ వంటి నేతలను అరెస్టు చేయడం దారుణమని కేటీఆర్ పేర్కొన్నారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు, నిర్బంధాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ల పునరుద్ధరణ కోసం సాగే పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ జర్నలిస్టులకు అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ఢిల్లీలో గాలి నాణ్యత వెరీ పూర్!

ఆందోళనకరంగా మారింది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా గాలి నాణ్యత తీవ్రంగా దిగజారినట్లు అధికారులు వెల్లడించారు. దట్టమైన పొగమంచు కారణంగా రోడ్డు రవాణా మందగించడంతో పాటు, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు మరింత ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్నవారు అత్యవసరంగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మాస్క్ వినియోగం, అవసరం లేని బయటి ప్రయాణాల్ని తగ్గించడం వంటి సూచనలు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదిలా ఉండగా, రాజధానిలో తీవ్ర వాయు కాలుష్య పరిస్థితులపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఇటీవల ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీని పీడిస్తున్న ఈ సమస్యకు తాత్కాలిక ఉపశమన చర్యలు సరిపోవని, దీర్ఘకాలిక పరిష్కారాలే అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారిన వాయు కాలుష్యానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతుండగా, ఢిల్లీ వాయు నాణ్యత సంక్షోభం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# డాక్టర్ కంటే ఫార్మసిస్ట్ బాధ్యత ఎక్కువ



– అరబిందో ఫార్మా డైరెక్టర్ ఎం. మదన్ మోహన్ రెడ్డి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ఫార్మసిస్ట్ బాధ్యత డాక్టర్ కంటే ఎక్కువని, రోగిని రక్షించే మందులను సరైన విధంగా అందించేది ఫార్మసిస్ట్‌నేనని అరబిందో ఫార్మా డైరెక్టర్ ఏం. మదన్ మోహన్ రెడ్డి అన్నారు. బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో డిసెంబర్ 27,28 తేదీల్లో జరుగుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ముగింపు సమావేశాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ముఖ్య అతిథిగా అరబిందో ఫార్మా డైరెక్టర్ ఏం. మదన్ మోహన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గొప్ప కళాశాల అంటే భవనాలు కాదు, బోధన నాణ్యత, విద్యార్థిలో ఆసక్తి, సృజన కీలకమన్నారు. భారత ఫార్మా రంగం ప్రపంచ స్థాయిలో ముందుందని, జెనరిక్ ఔషధాలకు విస్తృత అవకాశాలున్నాయని వివరించారు. కేయూ ఫార్మసీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ట్రైనింగ్‌లకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. గౌరవ అతిథి, అమెరికా ఎఫ్డీఏ పూర్వ సంచాలకులు డాక్టర్ మన్సూర్ ఖాన్ మాట్లాడుతూ.. తక్కువ వసతుల మధ్య క్రమశిక్షణ, మైండ్‌సెట్‌నే విజయానికి దారి చూపిందన్నారు. వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి కళాశాల పరిశోధనల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో దేశవిదేశాల నుంచి వెయ్యి మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. గోల్డెన్ జూబ్లీ అలుమ్నీ డైరీ ఆవిష్కరణ, సన్మానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలు ఆదివారం కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# వెండి పరుగులు!

ఇవాళ 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,200 పెరిగి రూ.1,41,220కు చేరింది. అదే సమయంలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,100 పెరిగి రూ.1,28,350గా నమోదైంది. వరుసగా వస్తున్న ఈ పెరుగుదల బులియన్ మార్కెట్‌లో పెట్టుబడిదారుల దృష్టిని మరింతగా ఆకర్షిస్తోంది. ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి, ఆర్థిక హెచ్చుతగ్గులు వంటి కారణాలతో పెట్టుబడిదారులు భద్రమైన లోహాల వైపు మొగ్గు చూపుతున్నారు. తరతరాలుగా బంగారం, వెండిని స్థిరమైన పెట్టుబడులుగా భావిస్తుండగా, ప్రస్తుతం వెండి ధరలు బంగారాన్ని మించిపోయే వేగంతో పెరుగుతున్నాయి. దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం వెండి మంచి ఎంపికగా మారుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ వేగం కొనసాగితే రానున్న రోజుల్లో బంగారం, వెండి ధరలు మరింత ఎత్తులకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

వేద న్యూస్

ఆదివారం డిసెంబర్ 28, 2025

# వీరాంగ్ రూట్లో లారీ బీభత్సం

- రెండు లారీలు ఢీ..
  డ్రైవర్ కు తీవ్రగాయాలు
- పరారీలో మరో లారీ డ్రైవర్



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్లోని అలుగునూర్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో రాజీవ్ రహదారిపై శనివారం ఉదయం ఘోర ప్రమాదం తప్పింది. ఎదురెదురుగా ఢీకొన్న లారీల ప్రభావంతో గ్రానైట్ లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ప్రమాద సమయంలో క్యాబిన్లో చిక్కుకున్న డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు ప్రారంభించగా, సమాచారం అందుకున్న ఎల్ఎండీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్ను తొలగించి డ్రైవర్ను బయటకు తీసి, వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా, ప్రమాదానికి కారణమైన రాంగ్రూట్ వచ్చిన లారీ డ్రైవర్ ఘటన అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న డ్రైవర్ను పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ప్రమాదంతో కొద్దిసేపు రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫి ను సర్దుబాటు చేశారు.

# టెన్త్ క్లాస్ విద్యార్థులకు కెరీర్ చార్ట్ అందజేశారు


**వేద న్యూస్, ఇల్లంతకుంట :**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు, బీసీ యువజన విభాగం మండల అధ్యక్షుడు భూమల్ల ప్రశాంత్, వీడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు వారి భవిష్యత్కు దిక్సూచిగా నిలిచే విధంగా ఒక కెరీర్ చార్ట్ను రూపొందించడం జరిగింది. ఈ కెరీర్ చార్ట్లో 10వ తరగతి పూర్తి చేసిన అనంతరం నుంచి పీజీ స్థాయి వరకు అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, వాటిలో చేరేందుకు అవసరమైన అర్హతలు, ప్రవేశ విధానాలు తదితర అంశాలను స్పష్టంగా వివరించడం జరిగింది. వారి సూచన మేరకు ఈ కెరీర్ చార్ట్ను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, గ్రామ ఉప సర్పంచ్ దొమ్మటి అజయ్, వార్డు మెంబర్ రాగెల్ల అనిల్, బీసీ గ్రామ అధ్యక్షుడు జంగిటి అజయ్, కనకరావు, అనిల్, రాములు తదితరులు పాల్గొన్నారు

# పహల్గామ్‌లో పర్యాటకుల సందడి

- మరుపు దిశగా ఉగ్రదాడి జ్ఞాపకాలు
- భద్రతపై భరోసా..
- పునరుజ్జీవం దిశగా కశ్మీర్ టూరిజం



**వేద న్యూస్, పహల్గామ్ ప్రతినిధి:**

కొన్ని నెలల క్రితం జరిగిన భయానక ఉగ్రదాడి జ్ఞాపకాలను పక్కనబెట్టి పర్యాటకులు మళ్లీ జమ్మూ కశ్మీర్ వైపు అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా లోయలోని అందమైన పర్యాటక కేంద్రం పహల్గామ్ కొత్త సంవత్సర వేడుకలకు కేంద్రంగా మారుతోంది. శనివారం నుంచే పెద్ద సంఖ్యలో పర్యాటకులు పహల్గామ్‌కు చేరుకుంటుండటంతో కశ్మీర్ లోయలో మళ్లీ పర్యాటక కళ కనిపిస్తోంది. గత ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మృతి చెందడంతో కశ్మీర్ పర్యాటక రంగం తీవ్రంగా దెబ్బతింది. ఆ ఘటన తర్వాత వేలాది మంది తమ పర్యటనలను రద్దు చేసుకున్నారు. పర్యాటక ప్రదేశాలు మూతపడటంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టాక్సీ ఆపరేటర్లు తీవ్ర నష్టాలు చవిచూశారు. పర్యాటక రంగంపై ఆధారపడి జీవించే వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. అయితే, ప్రస్తుతం పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయి. నగర జీవన ఒత్తిడికి దూరంగా ప్రశాంతంగా సమయం గడపాలనుకునే వారు మళ్లీ పహల్గామ్‌ను ఎంచుకుంటున్నారు. భద్రతా ఏర్పాట్లు బలంగా ఉండటంతో పర్యాటకులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హర్యానాకు చెందిన ఓ పర్యాటకురాలు మాట్లాడుతూ.. "నేను నా భర్తతో కలిసి తొలిసారిగా కశ్మీర్‌కు వచ్చాను. ఇది నిజంగా అద్భుతంగా ఉంది. భద్రతా ఏర్పాట్లు చాలా బాగున్నాయి. కొత్త సంవత్సరాన్ని ఇక్కడ జరుపుకోవడం సురక్షితంగా అనిపిస్తోంది" అని చెప్పారు. కొత్త సంవత్సర వేడుకల కోసం కళాశాల విద్యార్థుల బృందాలు కూడా పహల్గామ్‌కు చేరుకున్నాయి. ఓ విద్యార్థి మాట్లాడుతూ, "ఇప్పుడు పరిస్థితులు చాలా మెరుగ్గా ఉన్నాయి. ఇంతకుముందు శ్రీనగర్ వెళ్లాను, ఇప్పుడు పహల్గామ్ లో ఉన్నాను. ఇంకా మంచు కురవ లేదు కానీ రాబోయే రెండు మూడు రోజుల్లో కురుస్తుందని ఆశిస్తున్నాం. స్థానికులు ఎంతో సహకరిస్తున్నారు" అని తెలిపాడు. ఏప్రిల్ దాడి తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటకుల్లో భరోసా నింపేందుకు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం పెరుగుతున్న పర్యాటకుల రాక, కశ్మీర్ పర్యాటక రంగం మళ్లీ పుంజు కుంటుందన్న ఆశలకు బలం చేకూరు స్తోంది. శాంతి, భద్రత కొనసాగితే రాబోయే రోజుల్లో కశ్మీర్ మళ్లీ దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల హబ్‌గా మారుతుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# ఉపాధి హామీ బచావో

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

జనవరి 5వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం బచావో ఉద్యమాన్ని ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి సమావేశంలో తీర్మానం చేసినట్లు వెల్లడించారు. పేదవాడి ఆకలిని తీర్చడం, ప్రతి పౌరుడికి ఉపాధికి హామీ ఇవ్వడం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వంటి బహుళ ప్రయోజనాలతో అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం దేశంలోని కోట్లాది కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అలాంటి పథకాన్ని నిర్వీర్యం చేయడం, నిధులు తగ్గించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదలపై దాడి చేస్తోందని ఆయన విమర్శించారు. మహాత్ముడి పేరుతో తీసుకొచ్చిన ఈ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడం ప్రతి ప్రజాస్వామ్యవాద బాధ్యత అని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ స్పష్టం చేసినట్లు తెలిపారు. పేదల హక్కులను కాలరాస్తున్న చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం కేవలం ఒక పథకం మాత్రమే కాదని, గ్రామీణ భారతానికి ఆర్థిక భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ పథకం వల్ల గ్రామాల్లో పనులు జరిగి, వలసలు తగ్గాయని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం లభించిందని గుర్తు చేశారు. పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఏ మాత్రం సహించబోదని స్పష్టం చేశారు. జనవరి 5 నుంచి ప్రారంభమయ్యే బచావో ఉద్యమంలో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పేదల హక్కుల కోసం గళమెత్తాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల కోసం తెచ్చిన పథకాన్ని ప్రజలే కాపాడుకునే సమయం వచ్చిందని ఆయన అన్నారు.

# కొండూరుకు ఘనసన్మానం

- రవీందర్‌రావు లేఖతో 'సహకార' పెట్రోల్ బంకులకు అనుమతి
- తక్షణమే మున్సిపల్, జీహెచ్ఎంసీ, సహకార సంఘ ఎన్నికలు జరపాలి
- కరీంనగర్ డిసిసిబి చైర్మన్ పదవీ విరమణ కార్యక్రమంలో ఎంపీ ఈటల




**వేద న్యూస్, కరీంనగర్:**

సహకార రంగంలో పనిచేస్తున్న పెట్రోల్ బంక్‌లకు కమర్షియల్‌గా అనుమతి ఇవ్వాలని కొండూరు రవీందర్‌రావు కేంద్రానికి రాసిన లేఖతోనే దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పెట్రోల్ పంప్లకు కమర్షియల్ అనుమతి వచ్చిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ గీతభవన్‌లో జరిగిన డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు పదవీ విరమణ కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. రవీందర్ రావు చేసిన సేవలకు యావత్ కరీంనగర్ జిల్లా రాజకీయాలకు అతీతంగా ఆయన్ను సన్మానించుకుంటున్నామని చెప్పారు. 24 సంవత్సరాలుగా రాజకీయంగా ఈ జిల్లాతో తనకు ప్రత్యక్ష సంబంధం ఉందని పేర్కొన్నారు. రవీందర్ రావు ను తాను మొదటి రోజు నుంచి చూస్తున్నానని, డిసిసిబి ప్రగతిని ఏ రాజకీయ నాయకుడు కూడా ఒప్పుకోకుండా ఉండలేదని వెల్లడించారు. రవీందర్ రావుని సన్మానించుకోవడం భవిష్యత్తులో పనిచేసే వారికి స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు. కరీంనగర్ డిసిసిబి బ్యాంక్ రూ.400 కోట్ల టర్నోవర్ నుంచి రూ.8 వేల కోట్ల టర్నోవర్‌కు ఎదిగిందని పేర్కొన్నారు.

**తక్షణమే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి**

కరీంనగర్ డైరీని ఖతం పట్టించాలని ప్రయత్నం చేసినప్పుడు పాడిపంట ఉండాలని తాను కొట్లాడానని, పాలు మహిళలకు ఆదాయం అందిస్తుందనీ చెప్పానని తెలిపారు. తక్షణమే మున్సిపల్, జిహెచ్ఎంసి, మండల పరిషత్, సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలని ఎంపీ ఈటల కోరారు. 2004లో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేనాటికి ఈ సహకార వ్యవస్థకు ఉరివేసి చంపేసే ప్రయత్నం జరిగిందని గుర్తుచేశారు. సహకార రంగాన్ని మూసివేయవద్దని ఆనాడు కొట్లాడిన వారిల్లో తాను కూడా ఒకడిని.. దానికి సానుకూలంగా స్పందించి సహకార వ్యవస్థను రాజశేఖర్ రెడ్డి గారు బలోపేతం చేశారని తెలిపారు. సహకార వ్యవస్థ రాజకీయాలకు అతీతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ములకనూరు సొసైటీ, గట్టు నూతన పల్లి సొసైటీ, కరీంనగర్ డిసిసిబి, కరీంనగర్ డైరీలు కరీంనగర్ జిల్లాకే వన్నె తీసుకొచ్చాయని పేర్కొన్నారు. కమర్షియల్ బ్యాంకులు ఎలా పనిచేస్తున్నాయో మన సహకార బ్యాంకులు కూడా అంతకు ఏమాత్రం తీసుకోకుండా పని చేస్తున్నాయని వివరించారు. లైవ్ స్టాక్, వ్యవసాయ రంగంలో ఉన్న బాధ ఏందో తనివి తీర చూసిన వాన్ని కాబట్టి పార్లమెంటు స్టాండింగ్ కమిటీల్లో కూడా అడిగి మరీ మెంబర్ గా వేయించుకున్నానని చెప్పారు. ఈ వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వంలో అనేక నిర్ణయాలు తీసుకోబడ్డాయని తెలిపారు. సహకార వ్యవస్థ ఎంత బలంగా ఉంటే దేశం అంత ముందుకు పోతుందని అమిత్ షా భావిస్తున్నారని వెల్లడించారు. అమిత్ షా హెూం మంత్రిత్వ శాఖ మీద ఎంత దృష్టి పెడుతున్నారో.. అంతకంటే ఎక్కువ సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఒకనాడు అమిత్ షా సహకార బ్యాంక్ అధ్యక్షుడిగా పనిచేసి వచ్చినవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి , ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, పుట్ట మధు, సతీష్, మోహన్ రెడ్డి, లక్ష్మణ రావు, రవిశంకర్, మోహన్, అరుణ, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించిన కవిత

- రోగులతో సంభాషణ.. వైద్య సేవలపై ఆరా
- ప్రజల సమస్యలపై ప్రత్యక్ష అవగాహన



**వేద న్యూస్, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితులు, ఎదురవుతున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న రోగుల మాటలను శ్రద్ధగా విని, అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వైద్యులు, సిబ్బందిని కవిత ప్రశ్నించారు. మందుల లభ్యత, పరీక్షల సదుపాయాలు, సిబ్బంది సంఖ్య వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరగాలంటే సేవల నాణ్యత మరింత మెరుగుపడాలని కవిత అభిప్రాయపడ్డారు. రోగుల ఇబ్బందులను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని, ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని కవిత తెలిపారు. ఆసుపత్రి సందర్శనతో రోగులు, వారి కుటుంబ సభ్యుల్లో కొంత భరోసా నెలకొంది.

# సీఎంది దిగజారిన భాష

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అనుసరిస్తున్న భాషా వైఖరి, రాజకీయ ధోరణిపై తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నేత దాసోజు శ్రావణ్ బహిరంగ లేఖ విడుదల చేశారు. ప్రజాస్వామ్య సంస్కారం, రాజ్యాంగ విలువలను విస్మరించి అహంకారపూరితమైన, దిగజారిన భాషతో పాలన సాగించడం రాష్ట్రానికి తగదని ఆయన మండిపడ్డారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులకు గ్రామ స్వరాజ్యం బోధించాల్సిన ముఖ్యమంత్రి, బూతు రాజకీయాల పాఠాలు చెబుతున్నారని విమర్శించారు. కొడంగల్ వేదికగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడిన తీరు సభ్య సమాజాన్ని అసహ్యించుకునే స్థాయిలో ఉందని దాసోజు శ్రావణ్ ఆరోపించారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన చోట, వీధి రౌడీల భాషను తలపించేలా మాట్లాడడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని దిగజార్చిందని పేర్కొన్నారు. రాజకీయమంటే రౌడీయిజమే అన్న భావనను ప్రజల్లో నాటుతున్నారని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం కష్టనష్టాలు ఓర్చి, పదేళ్ల పాటు అహర్నిశలు శ్రమించి అభివృద్ధి సాధించిన కేసీఆర్ హుందాతనాన్ని ఈ సందర్భంగా దాసోజు శ్రావణ్ గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు అంశంపై ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించి నప్పటికీ, కేసీఆర్ తన ప్రసంగంలో ముఖ్యమంత్రి పేరును కూడా ప్రస్తావించకుండా హుందాతనాన్ని చాటుకున్నారని తెలిపారు. కానీ ఆ విమర్శలను ఆత్మపరిశీలనగా తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి, అనాగరిక భాషతో ప్రతిదాడికి దిగడం దురదృష్టకరమన్నారు. కేసీఆర్ రాష్ట్ర నిర్మాణకర్త అయితే, రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అమ్ముకునే దళారిలా వ్యవహరిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో ప్రజలు పథకాలపై చర్చించుకునేవారని, ఇప్పుడు ముఖ్యమంత్రి బూతులపైనే చర్చించుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణకు కావాల్సింది బూతు వాగ్వాదం కాదని, సామాజిక విలువలని స్పష్టం చేశారు. కేంద్రంలో మహానాయకులపై జరుగుతున్న అనైతిక దాడుల తరహాలోనే రాష్ట్రంలో కేసీఆర్‌పై దాడులు చేయడం సహించరాని నేరమని అన్నారు. ప్రజల ఆగ్రహాన్ని తక్కువ అంచనా వేయవద్దని హెచ్చరిస్తూ, కేసీఆర్ మౌనం తుఫాను ముందు నిశ్శబ్దమని దాసోజు శ్రావణ్ పేర్కొన్నారు. రైతు బంధు, రుణమాఫీ, ఆరు హామీలు అమలు కాక ప్రజలు రగిలిపోతున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే తీర్పు చెబుతారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తన భాష, వైఖరి మార్చుకుని, ఇచ్చిన హామీలు అమలు చేసి, ప్రజాస్వామ్య పాలన సాగించాలని హితవు పలికారు.

# గోదావరిలో వైభవంగా నదీ హారతులు



**వేద న్యూస్, భద్రాచలం:**

వేదమంత్రాల ఉచ్చారణలతో, శంఖనాదం మధ్య పుష్పాలు సమర్పిస్తూ గోదావరి తల్లికి వైభవంగా అర్చకులు నదీహారతి నిర్వహించారు. రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి జై.. అనే జయజయధ్వానాలతో గోదావరి పరివాహక ప్రాంతమంతా మారుమోగింది. నది తీర ప్రాంతాలు భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. పెద్ద ఎత్తున భక్తులు ఈ నదీహారతి కార్యక్రమంలో పాల్గొని గోదావరి తల్లికి భక్తిశ్రద్ధలతో హారతి సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు నది హారతి ప్రాముఖ్యతను భక్తులకు వివరిస్తూ, గోదావరి నది మహిమను తెలియజేశారు. శ్రీరామచంద్రమూర్తి దివ్య సన్నిధానంలో ప్రవహిస్తున్న గోదావరి నది అపారమైన మహిమ కలిగినదని, నిత్యం కోటి తీర్థాలు ఈ నదిలో కలిసి ప్రవహిస్తాయని పురాణాలు తెలియజేస్తున్నాయని అర్చకులు పేర్కొన్నారు. వేదకాలం నుంచే గోదావరిని తల్లి సమానంగా భావిస్తూ ఆరాధించే సంప్రదాయం ఉందని, వేదాల్లో నదికి సంబంధించిన అనేక సూక్తులు, ప్రార్థనలు ఉన్నాయని వివరించారు. సూక్తి అంటే మంచి మాటల ద్వారా కష్టాలు కలగనీయకుండా కాపాడమని తల్లిని ప్రార్థించే భావమని అర్చకులు తెలిపారు. రామాయణ కాలంలో అరణ్యవాసానికి వచ్చిన సమయంలో సీతాదేవి కూడా గోదావరి నదిని దేవతగా భావించి, నదిలో లభించే వనరులు మానవ జీవనానికి ఆధారమని పేర్కొన్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రకృతి అంశాలను దైవంగా భావించి ఆరాధించడం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనంగా వారు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఇతర అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొని గోదావరి నది హారతి కార్యక్రమాన్ని తిలకించారు. గోదావరి నది హారతి భద్రాచలం ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చుతూ, భక్తుల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని పాల్గొన్న భక్తులు తెలిపారు.

వేద న్యూస్

ఆదివారం డిసెంబర్ 28, 2025

# ప్రజలకు, ప్రభుత్వానికి సర్పంచులు వారధి

- క్షేత్రస్థాయిలో పథకాల అమలు బాధ్యత మీదే.
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలి
- సర్పంచుల సన్మాన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్



**వేద న్యూస్, కరీంనగర్:**

ప్రజలకు, ప్రభుత్వానికి సర్పంచులు వారధిగా పని చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో పద్మనగర్ లోగల ఇందిరా గార్డెన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ అనుకూల సర్పంచుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే బాధ్యత సర్పంచులదేనని స్పష్టం చేశారు. ఈ దిశగా పని చేసే సర్పంచులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. సర్పంచులు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు స్కూళ్లను తీర్చిదిద్దామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని, ఈ విషయంలో సర్పంచులను ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులకు మరింత బాధ్యత ఎక్కువగా ఉంటుందని, అటు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లడమే కాకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ పేరిట అమలవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడం ద్వారా కేంద్రప్రభుత్వం గాంధీజీ ఆశయాలకు తూట్లు పొడిచిందని మంత్రి పొన్నం విమర్శించారు. ఉపాధి హామీ పథకం పేరు మార్పునకు నిరసనగా ఈనెల 29న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన నూతన సర్పంచులను కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో 65శాతం మేరకు ప్రజల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికి లభించిందన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్సీ తానిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజాపాలనకు ప్రజలనుంచి ఆమోదం లభించిందన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను గ్రామాల్లో అమలు చేసే బాధ్యత ముమ్మాటికీ సర్పంచులదేనని స్పష్టం చేశారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, ఆ దిశగా సర్పంచులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు. సభాధ్యక్షుడు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణన గౌడ్, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్, పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టీఏ మెంబర్లు పడాల రాహుల్, సంగీతం రింకు, పార్టీ నాయకులు రుద్ర సంతోష్, ఊట్కూరి నరేందర్ రెడ్డి, అంజనీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వాలి

- జీఓ 252ను సవరించాలని కలెక్టర్‌కు టీఎస్‌జేయూ వినతి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎం.ఎస్. నెం.252 లోని లోపాలను వెంటనే సవరించి, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ను యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకగా కలిసి, సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతమున్న జీఓ 252 నిబంధనల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల తో పాటు చిన్న పత్రికలకు కూడా తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వార్తలు సేకరిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు వస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిబంధనలను సరళీకృతం చేయాలని కలెక్టర్ ను కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీఓ 252లోని లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ అందేలా చూడటంతో పాటు, చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కలెక్టర్ ను కలిసిన వారిలో టీఎస్‌జేయు వరంగల్ జిల్లా అధ్యక్షులు కంది మోహన్, ఉపాధ్యక్షులు ఈద శ్రీనాథ్, మీడియా ఇంచార్జ్ అవినాష్, నాయకులు మోహన్ రావు, అశోక్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# జీవో 252ను సవరించాలి

- చిన్నపత్రికలపై జరుగుతున్న కుట్రను అరికట్టాలి - టీఎస్జేయూ

**వేద న్యూస్, జనగామ:**



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మీడియా అక్రిడిటేషన్ జీవో ఎం.ఎస్. నెం. 252 లోని లోపాలను సవరించాలని, గ్రామీణ జర్నలిస్టుల కు, చిన్న పత్రికలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డుల పేరిట జరుగుతున్న కుట్రలను అడ్డుకోవాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ జనగామ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పలంచి నరేందర్ ఆధ్వర్యంలో శనివారం జనగామ కలెక్టరేట్లో అడిషనల్ కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి గొడ్డలిపెట్టుగా మారిన జీవో నెం. 252ను సవరించాలని కోరారు. దశాబ్దాలుగా వృత్తినే నమ్ముకుని బతుకుతున్న గ్రామీణ విలేకరులు, చిన్న పత్రికల ప్రతినిధుల పొట్టకొట్టేలా ఉన్న ఈ జీవోలోని నిబంధనలను ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్ను కార్తిక్, ఉపాధ్యక్షుడు గంగిశెట్టి మహేష్కుమార్, గౌరవ అధ్యక్షుడు మాదంశెట్టి శివకుమార్, కార్యనిర్వహక కార్యదర్శి తుంగ కౌశిక్, కార్యవర్గసభ్యుడు అఫ్రోజ్ పాల్గొన్నారు.

# జీఓ 252ను సవరించాలని కలెక్టర్‌కు వినతి

**వేద న్యూస్, హనుమకొండ :**



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎం.ఎస్. నెం.252లోని లోపాలను వెంటనే సవరించి, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ను యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకగా కలిసి, సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతమున్న జీఓ 252 నిబంధనల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు మరియు చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వార్తలు సేకరిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిబంధనలను సరళీకృతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జీఓ 252లోని లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ అందేలా చూడటంతో పాటు, చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమం లో టీఎస్‌జేయూ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ముత్తోజు రాము, ప్రధాన కార్యదర్శి దొరి హరికృష్ణ, నాయకులు ఆరూరి శ్రీనివాస్, సదానందం మరియు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# పీఎం జన్మన్ పథకంలో లోపాలు

- కోలం పీవీటీజీలకు ఇళ్లు అందడం లేదు
- మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహేష్



**వేద న్యూస్, కాసిపేట:**

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పీఎం జన్మన్ పథకం అమలులో తీవ్ర లోపాలు ఉన్నాయని, పీవీటీజీ కోలం గిరిజనులకు రావాల్సిన ఇళ్లు ఇప్పటివరకు అందడం లేదని కోలం సేవా సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అత్రం మహేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా కోలం గిరిజన కుటుంబాలకు గృహాలు మంజూరు చేయాల్సి ఉండగా, ఇప్పటికీ చాలామంది లబ్ధిదారులకు ఇళ్లు అందకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ అంశంపై త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే గానీ, జిల్లా కలెక్టర్ గానీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే.. కోలం గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ముట్టడికి సిద్ధంగా ఉన్నామని అత్రం మహేష్ హెచ్చరించారు. కోలం గిరిజనులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి, పీఎం జన్మన్ పథకం కింద అర్హులైన కోలం గిరిజనులకు తక్షణమే ఇళ్లు మంజూరు చేయాలని కోలం సేవా సంఘం నాయకులు కోరుతున్నారు.

# అథ్లెటిక్స్ పోటీల్లో పీసీకి సిల్వర్ మెడల్

**వేద న్యూస్, మెదక్:**



కరీంనగర్‌లో జరిగిన 12వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా నిర్వహించిన 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో మెదక్ జిల్లా పోలీస్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ ప్రభాకర్ గౌడ్ అద్భుత ప్రతిభ కనబరిచి రెండవ స్థానం సాధించి సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ప్రభాకర్ గౌడ్ ను అభినందిస్తూ క్రీడలతో పాటు విధుల్లోనూ మరింత ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# జీవాలకు నట్టల మందు పంపిణీ

**వేద న్యూస్, దామరచర్ల:**



దామరచర్ల మండల పరిధిలోని దిలావర్ పూర్ గ్రామ పంచాయతీలో జీవాలకు సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని సర్పంచ్ బెజ్జం సాయి శనివారం ప్రారంభించారు. పశువైద్యాధికారి డాక్టర్ వేణు తన సిబ్బందితో కలిసి గొర్రెలకు మందు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం, శీతాకాలం సమయాల్లో మూగజీవాలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, కాపర్లు వాటి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

# గొర్రెలకు నట్టల మందు పంపిణీ

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ గ్రామంలో శనివారం గొల్ల, కురుమ గొర్రెల పెంపకదారులకు చెందిన గొర్లకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతలపెల్లి విజయమ్మ, ముఖ్య అతిథులుగా పాల్గొని గొర్లకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెల ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే పెంపకదారుల జీవన భద్రత బలపడుతుందని పేర్కొన్నారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు నివారణ చర్యలు ఎంతో అవసరమని, ఇటువంటి కార్యక్రమాలు పెంపకందారులకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి పూర్ణ చంద్రిక, ఉప సర్పంచ్ దొమ్మటి అజయ్ వార్డు సభ్యులు రాగళ్ల శ్రీనివాస్, భూమల్ల ప్రశాంత్, చదవాల శ్రీధర్, దొమ్మటి శ్రీనివాస్, రాగళ్ల అనిల్, నృత అశోక్, నక్క వెంటికి, భూమల్ల పోచయ్య, ఎగుల్ల బాలయ్య, మల్లేష్ తూటి పరశురాములు నక్క పరశురాములు మల్లేశం తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు సన్మానం..





**వేద న్యూస్, రుద్రూర్:**

పేద కుటుంబంలో జన్మించి కష్టపడి చదువుకొని ఎంబీబీఎస్లో ఫ్రీ సీట్ సాధించిన జాకటి సుచిత్ర అక్బర్ నగర్, సాత్విక్ గౌడ్ రుద్రూర్, చల్లపల్లి సిరి కోటయ్య క్యాంపు ముగ్గురు విద్యార్థులను శనివారం ప్రవీణ్ కుమార్ ఆయన నివాసంలో శాలువాతో ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ రోజుల్లో ఏదైనా సాధించాలి అంటే కేవలం చదువుతోనే సాధ్యమన్నారు. తల్లితండ్రులు అంతంత మాత్రమే చదువుకొని ఎన్నో కష్టాలతో జీవితాన్ని నడుపుతూ తమపిల్లలకు చదివించి వారిని ప్రయోజకులను చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ముగ్గురు విద్యార్థులు కఠోర విద్యాభ్యాసం చేస్తేనే వారికి ఎంబీబీఎస్ ఫ్రీ సీట్లు వరించాయని అన్నారు. వారు ఇంకా కష్టపడి రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు ఉన్నారు.

# గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మతులు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా గుంతలు పడడంతో స్థానికులు గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత దృష్టికి తీసుకెళ్లగా ఆమె తక్షణమే స్పందించి శనివారం దగ్గరుండి రోడ్డు మనమ్మతు పనులు చేయించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా అడగగానే తక్షణమే స్పందించినందుకు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలవేని రమేష్, వార్డ్ సభ్యులు లింగం పెల్లి అనిల్, యూత్ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు

# వెంకటాపూర్ సర్పంచ్ కు ఘన సన్మానం

**వేద న్యూస్, కాసిపేట:**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పేంద్రం శంకర్ ను కుమురంభీం యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కుమురం భీం యువజన సంఘం అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, ప్రధాన కార్యదర్శి పెంద్రం తిరుపతి, ఉపాధ్యక్షులు పెంద్రం జగన్, ఆత్రం నాగరాజు, సంఘ సభ్యులు కుర్సెంగ తిరుపతి, కుర్సెంగ జలపతి, చిక్రం లక్ష్మన్, నందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంద్రం శంకర్ మాట్లాడుతూ... వెంకటాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. యువజన సంఘం సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వేద న్యూస్

ఆదివారం డిసెంబర్ 28, 2025

# క్రీడలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది

- యువతను ఆటల వైపు మళ్లించాల్సిన అవసరం ఉంది
- మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా క్రీడలే ఆయుధం
- ఎంపీ ఈటెల రాజేందర్
- రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న ఎంపీ



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ పట్టణ కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయసుతో సంబంధం లేకుండా క్రీడల్లో పాల్గొంటున్న వారు సమాజానికి గొప్ప స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. ఎనభై ఏళ్ల వయసులో కూడా యువకుల్లా ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను చూసి తాను ఎంతో ప్రేరణ పొందానని తెలిపారు. నేటి కాలంలో పిల్లలు ఆటలకు దూరమై మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లకే పరిమితమవుతున్నారని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆటలు లేకపోవడం వల్ల చిన్న వయసులోనే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. మన దేశంలో మానవ వనరులకు, విద్యకు కొదువలేదని, కానీ యువత ఆరోగ్యంపై తగినంత దృష్టి పెట్టడం లేదని వ్యాఖ్యానించారు. ఆరోగ్యవంతమైన తరం కోసం క్రీడలు తప్పనిసరి అని స్పష్టం చేశారు.క్రీడలను ప్రోత్సహించడంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రయత్నాలను ఆయన ప్రస్తావించారు. పాఠశాలలకే పరిమితం కాకుండా ప్రతి నియోజకవర్గంలో అన్ని రకాల క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. కోట్లాది మంది యువత క్రీడల్లో పాల్గొంటుండటం దేశ భవిష్యత్తుకు శుభ సూచకమని పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారతదేశం మరింత పురోగతి సాధిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. గ్రౌండ్‌లో ప్రతిరోజూ సాధన చేస్తున్న 81 ఏళ్ల లక్ష్మారెడ్డి అందరికీ ఆదర్శమని ఈటెల రాజేందర్ కొనియాడారు. ఆరోగ్యం లేకపోతే అన్నీ వ్యర్థమని, క్రీడలు మానవ సంబంధాలను బలపరుస్తాయని చెప్పారు. పిల్లలు చెడు అలవాట్లకు లోనుకాకుండా ఉండాలంటే చిన్నప్పటి నుంచే ఆటలపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మత్తు పదార్థాలు యువతను నిర్వీర్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, వాటిని నిర్మూలించేందుకు క్రీడలే శక్తివంతమైన మార్గమని ఎంపీ అన్నారు. చెడు అలవాట్లను అంతం చేసి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగల సామర్థ్యం క్రీడలకు ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గెలిచినవారు, ఓడినవారు అందరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎంపీ కోరారు. అలాగే 95 ఏళ్ల వయసులో కూడా ఎక్కడ క్రీడలు నిర్వహిస్తే అక్కడ హాజరవుతున్న నల్లగొండకు చెందిన నిరంజన్ రెడ్డిని సన్మానించారు. క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# దశాబ్దాల నీటి వారసత్వానికి వెలుగు

- కుందన్ బౌలి మెట్టు బావి పునరుద్ధరణకు అడుగులు
- శాస్త్రీయ సంరక్షణతో చారిత్రక గుర్తింపు
- నగర భవిష్యత్తుకు దారి చూపుతున్న ప్రయత్నం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




దశాబ్దాలుగా మట్టిలో కూరుకుపోయిన కుందన్ బౌలి మెట్టు బావిని పునరుద్ధరించేందుకు స్పష్టమైన చర్యలు ప్రారంభమయ్యాయి. 1810 నాటి ఈ చారిత్రక నీటి నిర్మాణాన్ని తిరిగి వెలుగులోకి తీసుకురావడం ద్వారా నగరానికి చెందిన జీవ వారసత్వాన్ని కాపాడే దిశగా కీలక ముందడుగు పడింది. ఒకప్పుడు నగర ప్రజలకు నీటి భద్రత అందించిన ఈ మెట్టు బావి, కాలక్రమేణా నిర్లక్ష్యానికి గురై భూగర్భంలో దాగిపోయింది. ఇప్పుడు దీనిని శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరించి, చారిత్రక ప్రాధాన్యతను తిరిగి చాటిచెప్పే ప్రయత్నం సాగుతోంది. నిర్మాణ లక్షణాలు, చరిత్ర, వినియోగ విధానాలపై సమగ్ర అధ్యయనం చేసి, పత్రాల రూపంలో నమోదు చేసే ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ఈ పునరుద్ధరణ కార్యక్రమం వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ముందుకు సాగుతోంది. స్పష్టమైన ప్రణాళిక, క్రమబద్ధమైన అమలు విధానం ద్వారా ఈ మెట్టు బావిని నగరానికి గర్వకారణంగా నిలపాలన్న లక్ష్యం కనిపిస్తోంది. సామాజిక బాధ్యత నిధుల సహకారంతో చేపడుతున్న ఈ పనులు, భవిష్యత్తులో ఇతర చారిత్రక నిర్మాణాల సంరక్షణకు మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంది. నగరం ముందుకు సాగాలంటే గతాన్ని మరచిపోకుండా, దాన్ని పరిరక్షించుకుంటూ ప్రయాణించాల్సిన అవసరం ఉందన్న సత్యాన్ని ఈ ప్రయత్నం గుర్తు చేస్తోంది. కుందన్ బౌలి మెట్టు బావి పునరుద్ధరణతో హైదరాబాద్ తన చరిత్రను కాపాడుకుంటూనే, స్థిరమైన నగరాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. గతాన్ని రక్షించుకున్నప్పుడే భవిష్యత్తు బలంగా నిర్మించగలమన్న సందేశానికి ఇది స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది.

# అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



- సర్పంచులు ప్రజల చేత శభాష్ అనిపించుకోవాలి
- సేవే చిరస్థాయిగా నిలిచే సంపద
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మహబూబాబాద్‌లో రూ.17 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**వేద న్యూస్, మహబూబాబాద్:**

పట్టణాలు, గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, గ్రామస్థాయిలో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ప్రజలకు మంచి పరిపాలన అందించి ప్రజల చేత శభాష్ అనిపించుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా సుమారు పదిహేడు కోట్ల రూపాయల వ్యయంతో జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మండలాల్లో సుమారు ఆరు కోట్ల యాభై లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ రహదారులు, తారు రహదారులు, వర్షపు నీటి కాలువలు తదితర అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి దివంగత నూకల రామచంద్రా రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. డోర్నకల్ మండల కేంద్రంలో చెరువు కట్ట అభివృద్ధికి రెండు కోట్ల రూపాయలు, తారు రహదారులు, మురుగు నీటి కాలువల పనులకు ఎనిమిది కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మున్సిపల్ పరిధిలో యాభై లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన భారీ వెలుగు దీపాలను ప్రారంభించడంతో పాటు, చెత్త సేకరణ కోసం స్వచ్ఛ వాహనాలను ప్రజలకు అంకితం చేశారు. అనంతరం మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో డెబ్బై అయిదు శాతం కంటే ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలుపొందినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులుగా గెలవడం కొద్దిమందికే దక్కే అవకాశం అని, ఎంతకాలం జీవించామన్నది కాదు, ప్రజల కోసం చేసిన సేవలు, మంచి కార్యక్రమాలే చిరస్థాయిగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. పేద ప్రజలకు అండగా నిలిచే ప్రభుత్వం అధికారంలో ఉన్న ఈ సమయంలో గ్రామస్థాయిలో నిజాయితీతో పని చేసి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ పర్యటనలో పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎఫ్ఎల్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, కాసిపేట:**




కాసిపేట మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ (సీఎఫ్ఎల్) ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీఎం రాజ్‌కుమార్ చేతులమీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఎం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు పొదుపు అలవాట్లు పెంచుకోవాలని, బ్యాంకింగ్ లావాదేవీల్లో జాగ్రత్తలు పాటించాలని, అలాగే రోజురోజుకు పెరుగుతున్న వివిధ రకాల ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్థిక అవగాహన కలిగి ఉండడం ద్వారా ప్రజలు భవిష్యత్తులో ఆర్థికంగా బలంగా నిలబడగలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు అశోక్ కుమార్, భాస్కర్, లక్ష్మి, ఎంఎస్ సీసీలు వసంత, శారద, పంచాయతీ కార్యదర్శి కవిత, కోశాధికారి చిన్నుబాయి, ఎంఎస్ ఈసీ సభ్యులు, సిబ్బంది, సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు ఎస్. రాహుల్, పి. రాజ్‌కుమార్, బి. తిరుపతి తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ పార్టీలో పలువురి చేరిక

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ఒగులాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం రసమయి మాట్లాడుతూ.. తెలంగాణలో మార్పు మొదలైందని, కాంగ్రెస్ పార్టీ పైన తెలంగాణ అంతటా తిరుగుబాటు ప్రారంభమైందన్నారు. గతంలో రైతన్నలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతుబంధును రైతుల ఖాతాల్లో వేశాం అని గుర్తుకు చేశారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ 11సార్లు రైతుబంధు పథకం కింద రూ. 72 వేల కోట్లు వేశారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అద్భుతమైన విజయం సాధించిందని, అధికార పార్టీ అరాచకాలను అక్రమాలను తట్టుకొని మరీ భారీ సంఖ్యలో గ్రామ పంచాయతీల్లో సర్పంచులుగా మన పార్టీ నేతలు గెలిచారని అన్నారు. కొందరు నాయకులు అధికార పార్టీ ప్రలోభాలకు లోనై పార్టీ వీడి పారిపోతే, గ్రామ గ్రామాన ఉన్న పార్టీ నేతలు నిలబడి కొట్లాడి గెలిచారని పేర్కొన్నారు. అలాంటి ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లారని అన్నారు. తెలంగాణ కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, అడగకముందే ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. పార్టీలో చేరిన వారిలో పండుగ రాజిరెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, ఎడ్ల రుషేందేర్ రెడ్డి, బైరి ప్రశాంత్, నాలవేణి ఎల్లయ్య, కీర్తి శ్రీకాంత్, రాదారపు మల్లేశ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమం లో రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నూతన సర్పంచు లుకాముటం లావణ్య రాములు, పట్నం అశ్విని శ్రీనివాస్, కుడుములు రేణుక నాగారాజు, గౌరవేణి శ్రీవాణి సుమన్, వికృతి స్నేహ లక్ష్మారెడ్డి, రడం లక్ష్మి, పెద్దలింగాపూర్ ఉప సర్పంచ్ ఎలవేణి రమేష్, మండల నాయకులు ఎండీ సాధుల్, ఎంద్ర చెందన్, రడం ప్రవీణ్, జెట్టి నాగరాజు సిద్ధం సాగర్, ఓగులాపూర్ నాయకులు అరె కొంరయ్య, గుండేటి ప్రశాంత్, పండుగు రాజిరెడ్డి, అలవాలా రాజేశం, మెడకొక్కుల ప్రవీణ్, కోడూరి సుజాత, వికృతి లావణ్య, గుండా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికే కృత్రిమ అవయవాల పంపిణీ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి కృత్రిమ అవయవాల పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ఆధ్వర్యంలో భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి సహకారంతో వరంగల్ జిల్లా పరిధి కొత్తవాడ లోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ ఫంక్షన్ హాల్ లో శనివారం నిర్వహించిన ఉచిత కృత్రిమ కాళ్ళ పంపిణీ శిబిరాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మంత్రి ప్రసంగించారు.కాళ్లు చేతులు లేని దివ్యాంగుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని, నిర్వాహకులు సీనియర్ ఐ ఏ ఎస్ నరహరి సేవలను మంత్రి ప్రశంసించారు, సొంత ఊరిలో ఆసుపత్రి నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని, విద్యా వికాసం కోసం, యువతి యువకులకు ఉపాధి కొరకు ఆలయ ఫౌండేషన్ వారు సేవలు అందిస్తున్నారని , ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ముంపుకు గురైన ప్రాంతాలలో నిత్యవసర సరుకులను అందించారని, గత 12 సంవత్సరాల కాలం నుండి ట్రస్టు ద్వారా ప్రజలకు సామాజిక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని అన్నారు. సేవే మార్గంగా ముందుకు పోతున్న క్రమంలో మహావీర్ సొసైటీ వారు భాగస్వాములు కావడం మరింత బలాన్ని ఇచ్చిందని తెలిపారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కలచి వేస్తాయని, వారికి ప్రభుత్వం ఆసుపత్రుల్లో కృత్రిమ అవయవాలు అందిస్తారని, అవి అధిక బరువు తో కూడుకొని ఉంటాయని, వాటిని వినియోగించుకోవడం దివ్యాంగులకు కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందని, ఈ ట్రస్ట్ ద్వారా అందించే పరికరాలు నాణ్యతతో పాటు తక్కువ బరువుతో దివ్యాంగులు వినియోగించుకునే విధంగా ఉపయుక్తం గా ఉన్నాయని అన్నారు. దివ్యాంగు లైనప్పటికీ అసాధ్యాలను సుసాధ్యం చేసిన వ్యక్తులు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఉన్నారని అన్నారు. కరీంనగర్ స్థానికత్వం ఐనప్పటికీ యూనివర్సిటీ లలో విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నారని, మంత్రి కొనియాడారు. కృత్రిమ పరికరాలు అమర్చుకున్న దివ్యాంగుల కు ఏమైనా సమస్యలు తలెత్తితే వారి సౌకర్యార్థం ప్రతి బుధవారం ఐదుగురు అవసరార్థులను హైదరాబాద్ లోని మహావీర్ సొసైటీ కి తీసుకువెళ్ళి చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. సీనియర్ ఐఏఎస్ నరహరి మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమాన్ని నిర్వహించడానికి అన్ని విధాలుగా సహకరించిన మంత్రి , వరంగల్ జిల్లా అధికార యంత్రాంగం, కలెక్టర్, బల్దియా మేయర్, కమిషనర్ లకు ధన్యవాదాలు తెలిపిన ఆయన తన తండ్రి మరణం అనంతరం సాంప్రదాయం ప్రకారం కర్మ కార్యక్రమాలు నిర్వహించడం భోజనాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ అని ఏ కార్యం చేయాలన్న డబ్బే ప్రధానం అని భావించిన క్రమంలో ఈ సంస్థను నడిపిస్తున్న తన మిత్రులు, కుటుంబసభ్యులు, మహావీర్ ట్రస్ట్ వారి సహకారంతో మొదటిసారి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో మూడు ప్రాంతాల్లో కృత్రిమ అవయవాల క్యాంపు ను తన మిత్రుడి ప్రథమ వర్ధంతి సందర్భం గా నిర్వహించడం జరిగిందని అన్నారు. అప్పుడు 400 మందికి మహావీర్ సంస్థ ఆధ్వర్యం లో సంస్థ సెక్రెటరీ సహకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి తెలంగాణ జిల్లాల్లో కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని అన్నారు. కాళ్ళు అమర్చే క్రమం లో ముఖ్య ఘట్టం పరికరాల తయారు చేయడానికి సంస్థ బృందం మొత్తం ఇక్కడికి వచ్చిందని మూడు రోజుల పాటు ఇక్కడే ఉండి కొలతలు తీసుకొని తయారు చేసి ఆ పరికరాలను ఆ అవయవాలకు అమర్చి దగ్గరుండి వాటి పనితీరును పరిశీలిస్తారని, గతం లో రాష్ట్ర వ్యాప్తం గా వివిధ ప్రాంతాల్లో క్యాంపు లు ఏర్పాటు చేసినపుడు వరంగల్ ప్రాంతం లో కృత్రిమ అవయవ అవసరార్థులు ఎక్కువ సంఖ్యలో ఉంటారని తమ దృష్టికి రావడం వల్ల ఇక్కడ క్యాంప్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి 3- 4 సం.లకు ఒకసారి పరికరాలను మార్చాలని అన్నారు. ఈ శిబిరం ద్వారా సుమారు 150 మందికి కృత్రిమ అవయవాలకు అందిస్తూన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తోపాటు కార్పొరేటర్లు ఆడెపు స్వప్న బసవరాజు కుమారస్వామి, కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, ట్రస్టు సీఈఓ రమేష్ బాబు, భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి కార్యవర్గ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# దేవాపూర్‌లో సర్పంచ్ పర్యటన

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ దేవాపూర్ సర్పంచ్ రాయి సిడం రాందాస్ గ్రామ అభివృద్ధి దిశగా చురుకైన చర్యలు చేపడుతున్నారు. వార్డ్ మెంబర్లతో కలిసి గత నాలుగు రోజులుగా పంచాయతీ పరిధిలోని అన్ని వార్డులను సందర్శిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రతి వాడలో ప్రత్యక్షంగా పర్యటిస్తూ త్రాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై గ్రామస్తుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను గుర్తించి, వాటిని దశలవారీగా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని ప్రతి వాడలో సమగ్ర అభివృద్ధి జరగాలన్న లక్ష్యంతో వాడవాడలా తిరుగుతూ ప్రజలతో నేరుగా మాట్లాడటం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాయి సిడం రాందాస్ పేర్కొన్నారు. ఈ పర్యటనల్లో వార్డ్ మెంబర్లు చరణ్ రాజశేఖర్, నరేష్, షాఫీ, అమ్మనగంటి సత్యనారాయణ, మెరుగు శంకర్, అన్నం కుమార్, రొడ్డ కిష్టయ్య, అరుణ్, సాయి వంశి తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073